సాక్షి
నిర్మల్
ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



ఎర్రబస్సు నుంచి ఏసీబస్సు వరకు..

ఎర్ర బస్సు నుంచి మొదలైన ఆర్టీసీ ప్రస్థానం ఏసీ బస్సు వరకు చేరింది. అంచెలంచెలుగా ఎదిగింది. ఉమ్మడి జిల్లాలో 'ప్రగతి'చక్రం పరిణామ క్రమంపై ప్రత్యేక కథనం. 8లో▸



వంతెన నిర్మాణం కలేనా?

ఖానాపూర్ నియోజకవర్గంలోని ఖానాపూర్, పెంబి మండలాల్లోని గిరిజన గ్రామాల్లో ఏళ్లుగా రవాణాసౌకర్యం మెరుగుపడడం లేదు. పాలకులు పట్టించుకోవడం లేదు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.2 /23.1

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది.

ఇంటి నుంచే రాజకీయాలు..

- ప్రెస్‌మీట్‌లైనా.. పెద్ద ప్రోగ్రామైనా..
- పార్టీ చేరికలైనా.. దీక్షలు చేపట్టాలన్నా..
- ఆ నాయకులకు తమ ఇల్లే వేదిక
- వాస్తుమార్పులు.. సెంటిమెంట్లు..
- కార్యాలయాలున్నా.. గడప దాటరు
- గృహమే అదృష్టలక్ష్మి అంటున్న నేతలు



ఎన్నికల ప్రచారాన్ని ఇంట్లో నుంచే ప్రారంభించిన మంత్రి అల్లోల దంపతులు(ఫైల్)

నిర్మల్: గృహమే కదా స్వర్గసీమ.. అని సాధారణంగా అంటుంటాం. ఈ నేతలు కూడా ఇంటితోనే తమకు అదృష్టమంటున్నారు. ఇంటిని దాటకుండా 'రచ్చ' గెలుస్తున్నారు. ఏళ్లు కాదు.. దశాబ్దాలు గడుస్తున్నా 'ఇల్లు' దాటకుండా రాజకీయాలు చేస్తున్నారు. చిన్నపాటి ప్రెస్‌మీట్‌లైనా.. పెద్దపెద్ద పార్టీ కార్యక్రమాలైనా, కార్యకర్తల చేరికలైనా.. ఏకంగా దీక్షలు, ఆందోళనలు చేపట్టాలన్నా.. ఇంటిని దాటేది లేదంటున్నారు. అలా.. తమ ఇల్లే తమకు కలిసొచ్చిందన్న నమ్మకంతో ఈసారి మళ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. పార్టీల పరంగా ప్రత్యేకంగా కార్యాలయాలు ఉన్నప్పటికీ అక్కడి నుంచి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాలు ఉన్నా.. ఎప్పుడో ఓసారి అందులో అడుగుపెడుతున్నారు. ప్రధానంగా నిర్మల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ముగ్గురూ ఇదే తరహాలో ఇల్లు దాటకుండా రాజకీయాలు చేస్తున్నారు.

'అల్లోల'కు ఇల్లే..

రాష్ట్ర మంత్రిగా వరుసగా రెండుసార్లు కొనసాగుతున్న అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి స్వగ్రామం నిర్మల్ రూరల్ మండలం ఎల్లపెల్లి. దశాబ్దాల క్రితమే నిర్మల్‌లోని శాస్త్రినగర్‌లో ఇల్లు నిర్మించుకుని ఇక్కడే ఉంటున్నారు. ఇదే ఇంటి నుంచి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. అల్లోల 1987 నుంచి క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగారు. పలు దఫాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014 నుంచి రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్నారు. ఎంత ఎదిగినా తన రాజకీయం మాత్రం గడప దాటకుండానే చేస్తారు. తన ఇంట్లోనే క్యాంప్ కార్యాలయం కొనసాగిస్తున్నారు. ప్రెస్‌మీట్లు, చిన్నపాటి పార్టీ సమావేశాలు, చేరికలు, ప్రజల నుంచి వినతుల స్వీకరణ ఇలా ఏదయినా తమ ఇంట్లోనే కొనసాగిస్తున్నారు. గతంలో 2009లో ఓడిన తర్వాత వాస్తుపరంగా ఇంట్లో మార్పులు చేర్పులు చేయించారు. అలాగే దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌తోపాటు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఇలా ఎంతోమంది ప్రముఖులకు అల్లోల తన ఇంటి భోజనం రుచి చూపించారు.

ఆ నేతలూ..

జిల్లాలో చాలామంది ప్రజాప్రతినిధులు, నేతలు తమ సొంతింటి నుంచే రాజకీయాలు కొనసాగిస్తున్నారు.

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ సైతం ప్రస్తుతం తన సొంత ఇంటి నుంచే రాజకీయాలు నడిపిస్తున్నారు. కొంతకాలం ఎమ్మెల్యే అధికారిక నివాసంలోనూ ఉన్నారు.
- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, ముథోల్ నుంచి రెండుసార్లు పోటీచేసిన డాక్టర్ పడకంటి రమాదేవి సైతం భైంసాలో కొన్నాళ్లపాటు అద్దె ఇంట్లో, ప్రస్తుతం సొంతింట్లో నుంచి రాజకీయాన్ని కొనసాగిస్తున్నారు.
- ముథోల్ బీజేపీ టికెట్ కోసం పోటీ పడుతున్న పటేల్ సోదరులు రామారావుపటేల్, మోహన్‌రావు పటేల్‌లది మరో తరహా. వీరి నివాసాలు, పత్తి ఫ్యాక్టరీలు ఒకే ప్రాంగణంలో ఉంటాయి. వారి రాజకీయాలూ అక్కడి నుంచే కొనసాగించడం విశేషం.
- ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నియోజకవర్గానికి వచ్చినప్పుడు తమ స్వగ్రామం దేగాంలోని ఇంట్లోనే ఉంటున్నారు. కానీ.. పార్టీ, అధికారిక కార్యక్రమాలు ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్‌ఆఫీస్, భైంసాలోని పార్టీ ఆఫీస్‌నుంచి సాగిస్తున్నారు.

ఇల్లు దాటని 'ఏలేటి'

రాజకీయాల్లోకి వస్తూనే సేవా కార్యక్రమాలతో ప్రజలకు దగ్గరై, 2009 ఎన్నికల్లో అనూహ్య విజయం సాధించారు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి. పీఆర్పీ నుంచి గెలుపొంది, ఆ తర్వాత కాంగ్రెస్‌లో తమ పార్టీతో పాటు కలిసివెళ్లిన ఆయన తాజాగా బీజేపీలో నిర్మల్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. జిల్లా కేంద్రంలోని బైల్‌బజార్‌నుంచి గాజుల్‌పేట్ వెళ్లే మార్గంలో ఇల్లు నిర్మించుకున్న ఏలేటి దాదాపు 14–15ఏళ్లుగా తన నివాసాన్నే రాజకీయ ప్రయోగశాలగా కొనసాగిస్తున్నారు. దాదాపు ఉత్తర తెలంగాణలోనే ఏ నేత ఇంట్లో లేనట్లుగా తన నివాసంలోనే పెద్ద మీటింగ్ హాల్, పైన అతిథులు, నేతలు ఉండటానికి గదులు, ప్రత్యేకంగా వంటగదిని నిర్మించుకున్నారు. తన గెలుపోటముల ప్రస్థానంలో మార్పులకు, వాస్తు సలహాలకు ఇంటిలో ఎన్నో మార్పులు తీసుకువచ్చారు. ఇంటి నుంచే రాజకీయాలు కొనసాగిస్తున్నారు. అది ఎంతలా అంటే.. ఇటీవల ఆగస్టులో మాస్టర్‌ప్లాన్‌పై ఏకంగా ఆమరణ నిరాహార దీక్షను ఇంట్లోనే ప్రారంభించారు. నిత్యం వందల మంది, బీజేపీ రాష్ట్రస్థాయి నేతలు వచ్చినా అక్కడే టెంట్లు, భోజనాలు ఏర్పాటు చేసి కొనసాగించడం గమనార్హం. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడూ మహేశ్వర్‌రెడ్డి ఇదే తరహాలో తన నివాసాన్నే పార్టీ కార్యాలయంగా కొనసాగించారు.



తన ఇంట్లోనే ఆమరణదీక్ష చేపట్టిన మహేశ్వర్‌రెడ్డి

కొత్తింట్లో 'కూచాడి'



శ్రీహరిరావు నివాసంలో పార్టీలో చేరికలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ ఫ్లోర్‌లీడర్‌గా, తెలంగాణ ఉద్యమకారుడిగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు కూడా ఇంటి పట్టునుంచే రాజకీయాలు కొనసాగిస్తూ వస్తున్నారు. రెండు దఫాలుగా టీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో గతంలో ఉన్న పాత ఇంటిని తీసేసి, కొత్త భవనం నిర్మించుకున్నారు. అదే ఇంటి నుంచి ప్రస్తుతం కాంగ్రెస్ తరఫున రాజకీయాలు చేస్తున్నారు. ఉద్యమ కాలంలోనూ శ్రీహరిరావు నివాసమే చర్చలు, సమావేశాలకు వేదికగా కొనసాగింది. ఇప్పుడు ప్రెస్‌మీట్లు, పార్టీ సమావేశాలు, నేతల చేరికలు, మంతనాలు అన్నీ తన నూతన భవనంలోనే కొనసాగిస్తున్నారు. సమావేశాలు, మంతనాలు జరపడానికి అనువుగా ఇంటిని నిర్మించుకున్న శ్రీహరిరావు అవసరమైతే దీక్షలు, సమావేశాలు చేపట్టేందుకు వీలుగా సిద్ధం చేసుకున్నారు.

నిలిచిన సమీకృతం..!

- రెండేళ్లుగా ఆగుతూ సాగుతున్న పనులు
- బిల్లులు రావడం లేదంటున్న కాంట్రాక్టర్లు



భైంసాలో నిలిచిన మార్కెట్ నిర్మాణ పనులు

భైంసాటౌన్: పట్టణాల్లో ప్రజలకు కూరగాయలు, మాంసం, చేపలు, పూలు, పండ్లు.. ఇలా అన్నీ ఒకే చోట అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణం జిల్లాలో నత్తనడకన సాగుతోంది. నిర్మాణం ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా ఇప్పటికీ పనులు సగం కూడా పూర్తి కాలేదన్నారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో సమీకృత మార్కెట్లు మంజూరు కాగా, టెండరు దక్కించుకున్న నిర్మాణ సంస్థ భైంసా, ఖానాపూర్‌లో మాత్రమే రెండేళ్ల కిందట పనులు ప్రారంభించారు. నిర్మల్‌లో స్థల వివాదం నేపథ్యంలో ఇటీవల మంత్రి కేటీఆర్ చేతులమీదుగా శంకుస్థాపన చేశారు.

నిలిచిన పనులు...!

సమీకృత మార్కెట్ల నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యత పబ్లిక్‌హెల్త్ విభాగానికి అప్పగించారు. టెండరు దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ సంస్థ భైంసా, ఖానాపూర్‌లో పనులు ప్రారంభించినా, రెండేళ్లు కావస్తున్నా పనులు పూర్తికావడం లేదు. దాదాపు 50 శాతానికిపైగానే పనులు పూర్తి కాగా, కొద్దిరోజులుగా గుత్తేదారులు ఎలాంటి పనులు చేపట్టడం లేదు. భైంసాలో దాదాపు రూ.4.50 కోట్లు, ఖానాపూర్‌లో 1.50 కోట్లతో పనులు చేపట్టగా, బిల్లులు సకాలంలో రాకపోవడంతోనే పనులు ఆపేసినట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. క్షేత్రస్థాయి పనులు నిలిచిపోగా, సంబంధిత అధికారులు మాత్రం పనులు కొనసాగుతున్నట్లు చెబుతుండడం గమనార్హం. దీంతో సమీకృత మార్కెట్లు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయని పట్టణవాసులు ఎదురుచూస్తున్నారు.

పనులు ఆగలేదు...

భైంసా, ఖానాపూర్‌లో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పూర్తయిన పనులకు రికార్డు చేసి బిల్లులను ప్రభుత్వానికి పంపించాం. నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూస్తాం.

– సంతోష్, డీఈఈ, పబ్లిక్ హెల్త్ విభాగం

న్యూస్‌రీల్

భైంసా కోర్టును సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



జడ్జికి జ్ఞాపిక అందిస్తున్న న్యాయవాదులు

భైంసాటౌన్: హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద జిల్లా జడ్జి కర్ణకుమార్‌తో కలిసి భైంసా కోర్టును శనివారం సాయంత్రం సందర్శించారు. భైంసా కోర్టు జడ్జి దేవేంద్రబాబు, న్యాయవాదులు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. కోర్టు ఆవరణలో కలియదిరిగారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘువీర్, సీనియర్ న్యాయవాదులు శంకర్, డబ్బ్యా భీంరావు, ఏజీపీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పాపహరేశ్వరాలయంలో జడ్జి పూజలు

దిలావర్‌పూర్: ప్రాచీన ప్రాశస్త్యం గల మండలంలోని శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయంలో హైకోర్టు జడ్జి నంద శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. చైర్మన్ నార్వాడి వెంకట్రావు పాటిల్ ఆధ్వర్యంలో అర్చకులు, ఆలయ అధికారులు జడ్జికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేయించారు. పాపహరేశ్వరునికి అభిషేకం చేశారు. అనంతరం శ్రీమతాన్నపూర్ణేశ్వరీదేవికి కుంకుమార్చన చేశారు.

ఈవీఎం గోదాం తనిఖీ చేసిన కలెక్టర్



ఈవీఎం గోదాం వద్ద మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవీఎం గోదాంను కలెక్టర్ వరుణ్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శనివారం తనిఖీ చేశారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఈవీఎంలను పరిశీలించారు. ఈవీఎంల లెక్క తేల్చి ప్రభుత్వానికి నివేదించారు.

సొనారి మండలం కోసం వినతి



భాస్కర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న సొనారి, పల్సి, గోడాపూర్ గ్రామస్తులు

కుభీర్: సొనారి కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేయాలని డిప్యూటీ కలెక్టర్ ఎ.భాస్కర్‌రావుకు శనివారం వినతిపత్రం ఇచ్చారు. సొనారి మండలం ఏర్పడితే హంపోలి, కస్రా, వర్ని, అంతర్ని, సిర్పెల్లి తదితర గ్రామపంచాయతీలకు దగ్గరగా ఉంటుందన్నారు. ఇటీవల ప్రభుత్వ ప్రకటించి మాలేగాం మండలంలో సొనారి, గోడాపూర్ గ్రామాలు ఉన్నాయని తెలిపారు. కొత్తగా ఏర్పడే మండలం నుంచి తమ గ్రామాలను తొలగించి సొనారిని మండలంగా ప్రకటించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో మాజీ సర్పంచులు నాగోరావ్, హన్మాండ్లు, నాయకులు నారాయణ, మల్లారెడ్డి, సందీప్ పటేల్, ముత్యంరావ్, నాగభూషణ్, గోడాపూర్, పల్సి గ్రామాల ప్రతినిధులు ఉన్నారు.

12న జాబ్ మేళా

నిర్మల్ రూరల్: ఇంటర్మీడియెట్ పాసైన అభ్యర్థులకు ఈనెల 12న ఎంఎస్ఎన్ ఫార్మ కంపెనీలో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి పరుశురాం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటలకు మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 2022–23లో ఇంటర్మీడియెట్(ఎంపీసీ, బైపీసీ, ఫార్మాటిక్, ఎంఎల్టీ) పాస్ అయిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. వయసు 20 ఏళ్లలోపు ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.11 వేల వేతనం ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారిని కంపెనీ ఉచితంగా డిగ్రీ చదివిస్తుందని వివరించారు. వివరాల కోసం 91820 63878 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

21న పీడీఎస్ బియ్యం వేలం

నిర్మల్ రూరల్: జిల్లాలో పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని ఈనెల 21న వేలం వేయనున్నట్లు అదరపు కలెక్టర్ కిశోర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్, భైంసా, ముథోల్, ఖానాపూర్ ఎంఎల్ఎస్ పాయింట్లలో 137క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యం అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 21న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు.

మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..!

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, వేదికపై ఎమ్మెల్యే, ఎంపీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/చెన్నూర్: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని, హాజీపూర్ మండలంతోపాటు మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం ఆయన మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం దొనబండలో ఏర్పాటు చేసిన సభావేదిక వద్ద రూ.80.50కోట్లతో నిర్మించనున్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు–పడ్తనపల్లి ఎత్తిపోతల పథకానికి, దొనబండలో రూ.1.90కోట్లతో నిర్మించనున్న 33/11కేవీ సబ్‌స్టేషన్ పనులకు, చెన్నూర్ పట్టణంలో రూ.10కోట్లతో నిర్మించిన 50 పడకల ఆస్పత్రి, రూ.55కోట్లతో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు, దోభీఘాట్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. చెన్నూర్ మండలం సుద్దాల వాగుపై రూ.15కోట్లతో నిర్మించిన వంతెన ప్రారంభించారు. దొనబండ సభ, చెన్నూర్ రోడ్డు షోలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా ఏర్పాటుతోపాటు 380 పడకల ఆస్పత్రి, గుడిపేటకు వైద్య కళాశాల తీసుకురావడంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు కృషి ఉందని తెలిపారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నేడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయని అన్నారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని, ఈ క్రమంలో ఆగం కాకుండా సమగ్రంగా ఆలోచించి తగిన నిర్ణయంతో మరోసారి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా దివాకర్‌రావును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని, మూడోసారి సీఎంగా కేసీఆరే అని జోస్యం చెప్పారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా ఎలాంటి అభివృద్ధి, సంక్షేమానికి తావు లేకుండా పాలనను భ్రష్టుపట్టించి ప్రజలను నయవంచన చేసిందని విమర్శించారు. భస్మాసుర కాంగ్రెస్ పార్టీతో మోసపోవద్దని హితవు పలికారు. బీజేపీ రకరకాల కమిటీలు వేయడం మాని డిపాజిట్లు దక్కించుకునే కమిటీ వేసుకుని డిపాజిట్లు దక్కించుకోవాలని ఎద్దేవా చేశారు. చెన్నూర్‌లో అభివృద్ధి పరంపర కొనసాగాలంటే మరోసారి బాల్క సుమన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రోడ్డు షోలో అన్నారు. ఈ కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్‌నేత, ఎమ్మెల్సీ దండె విఠల్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు. మంత్రి హరీశ్‌రావుకు ప్రజాప్రతినిధులతోపాటు మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, రామగుండం సీపీ రెమారాజేశ్వరి, డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

ప్రత్యేక నిధులతో మరింత అభివృద్ధి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: సీఎం కేసీఆర్ విడుదల చేసిన ప్రత్యేక నిధులతో నిర్మల్ పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ మున్నూరుకాపు సంఘం సమీపంలో 1, 23, 36, 37, 38, బంగల్‌పేట్ చౌరస్తాలో 3, 4, 5, 24, 25 వార్డుల్లో చేపట్టే రూ.3.50కోట్ల పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సీఎం కేసీఆర్ స్పెషల్ ఫండ్ కింద రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. అనంతరం మంత్రిని కాలనీవాసులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, డాక్టర్ చక్రధరి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగోండ రాము, మున్సిపల్ విప్ నేరెళ్ల వేణు, కౌన్సిలర్లు జగడం రాజు, కత్తి నరేందర్, పూదరి రాజేశ్వర్, సీనియర్ నాయకులు పూదరి సాయికృష్ణ, అప్పాల వంశీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కృషితో కులవృత్తులకు జీవం

ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన కుల వృత్తులకు తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ జీవం పోశారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. కుల వృత్తులనే నమ్ముకుని జీవిస్తున్న వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రూ.లక్ష సాయం అందించి అండగా నిలుస్తున్నారని తెలిపారు. సమీకృత కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ కులవృత్తుల వారికి మంజూరైన రూ.లక్ష చెక్కులను శనివారం పంపిణీ చేశారు. మైనార్టీబంధు చెక్కులు కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, ఎస్ఎస్‌సీఎస్ చైర్మన్ రాజేందర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మరుగొండ రాము, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలపై ప్రభుత్వాలను నిలదీయాలి

నిర్మల్ రూరల్: ఎన్నికల హామీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలని అఖిల భారత ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద నాయక్ కోరారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో శనివారం మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చి నేటికీ అమలు చేయడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి, రుణమాఫీ, గొర్రెల పంపిణీ, దళితబంధు, బీసీబంధు, కేజీ టూ పీజీ విద్య లాంటి అమలు చేయలేని హామీలు ఇచ్చిందన్నారు. అప్పుడు ప్రజలను మభ్యపెట్టి, ప్రస్తుతం ఓట్లు దండుకోవాలని చూస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి కార్పొరేట్ శక్తులకు లబ్ధి కలిగేలా చేస్తుందని ఆరోపించారు. వంటగ్యాస్ ధరలు, డీజిల్, పెట్రోల్, నిత్యావసర ధరలు పెరిగి పేదలు కడుపునిండా తిండి తినలేని పరిస్థితి నెలకొందన్నారు. సంక్షేమ పథకాలకు గ్రామ సభల ద్వారా అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట లంబాడా హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాసమల్ల అశోక్, బహుజనముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు సూర్యకాంత్ ఉన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న డీఆర్వో సిద్దార్థ

కడెం: వన్యప్రాణుల సంరక్షణ మన అందరి బాధ్యత అని పాండ్వాపూర్ డిప్యూటీ రేంజ్ అధికారి సిద్దార్థ అన్నారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వన్యప్రాణి సంరక్షణపై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి స్వామి, అధ్యాపకులు, అటవీ సిబ్బంది అలీం, మీనాక్షి, జిజియా, ఎం.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

- విద్యుత్ ఎస్ఈ జేఆర్.చౌహాన్



సబ్‌స్టేషన్ పనులు పరిశీలిస్తున్న చౌహాన్

లోకేశ్వరం: విద్యుత్ సబ్ స్టేషన్ పనులు త్వరగా పూర్తిచేయాలని విద్యుత్ ఎస్ఈ జేఆర్.చౌహాన్ ఆదేశించారు. మండలంలోని రాజూర గ్రామంలో జరుగుతున్న సబ్‌స్టేషన్ పనులను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో చేయాలని సూచించారు. నిర్మాణం పూర్తయితే రాజూర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లో వోల్టే జీ సమస్యలు ఉండవన్నారు. రూ.1.40 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రహరీ నిర్మాణానికి అంచనాలు రూపొందించామని తెలిపారు. ఆయన వెంట లోకేశ్వరం ఏఈ శివకుమార్ ఉన్నారు.

కొత్త మండలంగా బీరవెల్లి

- ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల
- హర్షం వ్యక్తంచేసిన మంత్రి 'అల్లోల'
- మొత్తం 23కు చేరనున్న మండలాలు



మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

నిర్మల్: జిల్లాలో మరో కొత్త మండలంగా బీరవెల్లి ఏర్పాటుకానుంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్‌మిట్టల్ శనివారం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. సారంగపూర్ మండలంలో ఉన్న బీరవెల్లి కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా డిమాండ్ ఉంది. ఇటీవల పొన్కల్, బెల్తరోడ, మాలేగాం మండలాలకు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ బీరవెల్లి ప్రస్తావన తీసుకురాలేదు. ఈనేపథ్యంలో స్థానికంగా మరోసారి చర్చ మొదలైంది. దీంతో ఈనెల 4న నిర్మల్ సభలో మంత్రి కేటీఆర్ మరో మూడు మండలాలకూ ముందే ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పారు. మంత్రి మాటల ప్రకారం బీరవెల్లి మండలం అవుతుందన్న విషయం తేలిపోయింది. ఇక ఇంకా మిగిలిన రెండు మండలాలు ఏవన్న చర్చ నడుస్తోంది. కడెం మండలంలోని లింగాపూర్, లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ కేంద్రాలుగా గతంలో ప్రతిపాదనలు పంపించారు.

తొమ్మిది గ్రామాలతో..

సారంగపూర్ మండలంలోని ఎనిమిది, దిలావర్‌పూర్ మండలంలోని ఒక గ్రామంతో బీరవెల్లి కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేశారు. పదిహేను రోజులు అభ్యంతరాలు, అభిప్రాయాలను కలెక్టరేట్‌లో తెలుపవచ్చని పేర్కొన్నారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం కొత్త మండలంలో బీరవెల్లి, ప్యారమూర్, తాండ్ర(జి), వైకుంఠాపూర్ (దోనిగాం), కంకెట, వంజర్, చించోలి(ఎం), జౌళి, కాల్వ గ్రామాలు ఉండనున్నాయి. బీరవెల్లి మండలం ఏర్పాటుతో జిల్లాలో మొత్తం 23 మండలాలు కానున్నాయి.

హర్షం వ్యక్తం చేసిన మంత్రి..

కొత్త మండలంగా బీరవెల్లిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేయడంపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ప్రజలకు అందుబాటులో పాలన, అధికారులు ఉండాలన్న లక్ష్యంతో కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ ఇప్పుడు కొత్త మండలాలనూ ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. మంత్రిని ఆయన నివాసంలో బీరవెల్లికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, సారంగపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, బీరవెల్లి సర్పంచ్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గణేశ్‌చక్రవర్తి, నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎస్‌జేఎం ప్రచార ప్రముఖ్‌గా జిల్లా వాసి



సాయికిరణ్

ఆదిలాబాద్: స్వదేశీ జాగరణ్ మంచ్ సికింద్రాబాద్ విభాగం ప్రచార ప్రముఖ్‌గా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మాజీ సభ్యుడు కోటావార్ సాయికిరణ్ నియామకమయ్యారు. హైదరాబాదులోని సీసీఆర్టీలో నిర్వహించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్వదేశీ జాగరణ్ మంచ్ ప్రాంత ప్రశిక్ష వర్గా కార్యక్రమంలో మంచ్ రాష్ట్ర కన్వీనర్ హరీష్‌బాబు ఆయన నియామకాన్ని ప్రకటించారు. అనంతరం సాయికిరణ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో విభాగ్ స్థాయి బాధ్యతను అప్పగించిన రాష్ట్ర సంఘటన మంత్రి రచ్చ శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్‌కు రాష్ట్ర పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఆర్‌ఎం

ఆదిలాబాద్: టీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రావణ మాసం చాలెంజ్ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ రాష్ట్రవ్యాప్తంగా మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ చేతుల మీదుగా ఆదిలాబాద్ ఆర్‌ఎం సోలోమన్ రూ.50వేల నగదు పురస్కారంతో పాటు జ్ఞాపికను అందుకున్నారు. కార్యక్రమంలో ఈడీ వినోద్‌కుమార్, డిప్యూటీ ఆర్‌ఎం సురేశ్, డిపో మేనేజర్లు కల్పన, ప్రతిమారెడ్డి, శ్రీధర్ ఉన్నారు.

రూ.30 చీరకు రూ.300 కూలి నష్టపోవాలా.?



నిరసన తెలుపుతున్న మహిళలు

ఎదులాపురం: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న 30 రూపాయల బతుకమ్మ చీరల కోసం వచ్చే కూలీలు 300 రూపాయల కూలి డబ్బులను నష్టపోవాల్సి వస్తోందని భారత జాతీయ మహిళా సమైక్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళినిరెడ్డి అన్నారు. నాసిరకం బతుకమ్మ చీరల పంపిణీని నిరసిస్తూ ఆదిలాబాద్‌లో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఇందులో సంఘం నాయకురాళ్లు అమీనా ఖాన్, తార, పుష్ప పాల్గొన్నారు.



అల్బియన్ బస్సు

ఏసీ బస్సు

ఎర్రబస్సు నుంచి ఏసీ బస్సు వరకు..

- అంచెలంచెలుగా ఆర్టీసీ పరిణామ క్రమం..
- ఆధునికత సంతరించుకున్న ప్రజా రవాణా సంస్థ
- ఆటుపోట్లను తట్టుకుని.. నిలదొక్కుకుని
- ఆదరణ పెంచుకుంటున్న ప్రగతి రథచక్రం
- ఉమ్మడి జిల్లాతో ప్రత్యేక అనుబంధం

ఆదిలాబాద్: ఒకప్పుడు తెలంగాణలో పక్క ఊరికి వెళ్లాలన్నా కాలినడకే శరణ్యం. స్వాతంత్ర్యానికి పూర్వం కేవలం ధనికులు, ఎగువ మధ్యతరగతి కుటుంబాలకు మాత్రమే ప్రైవేటు వాహనాలు ఉండడంతో దూరప్రాంతాలకు ప్రయాణం చేసేవారు. 1932లో నిజాం ప్రభువు మీర్ ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్ రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థను ప్రారంభించడంతో ప్రజలకు రవాణా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ విధంగా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కోట్లలో ప్రయాణికులను గమ్యస్థానాలకి చేరుస్తూ విడదీయలేని అనుబంధాన్ని ఏర్పర్చుకుంది.

ఇదీ చరిత్ర...

నైజాం పాలిత హైదరాబాద్ రాష్ట్రంలో 1932 వరకు నిజాం రైల్వే రవాణా సంస్థ మాత్రమే ఉండేది. కేవలం సంపన్న వర్గాలకు మాత్రమే ప్రైవేట్ వాహనాల ద్వారా రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండేవి. అయితే సంస్థాన చివరి పాలకుడైన ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ తల్లి జహీరున్నీసా బేగం కోరిక మేరకు ఆయన హైదరాబాద్ రాష్ట్రంలో బస్సు రవాణా వ్యవస్థను ప్రారంభించారు. నైజాం రాష్ట్ర రైల్వే, రోడ్డు రవాణా సంస్థ పేరిట 1932లో బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దేశంలో బస్సుల తయారీ రంగం అంతగా అభివృద్ధి చెందని పరిస్థితుల్లో అప్పటి యునైటెడ్ కింగ్‌డం (ఇంగ్లాండ్) లండన్ నుంచి 27 బస్సులను ప్రత్యేకంగా ముంబై వరకు ఓడల్లో తీసుకువచ్చారు. అక్కడి నుంచి రహదారి మార్గంలో బస్సులు హైదరాబాద్ చేరుకున్నాయి. తల్లి స్మృత్యర్థం మీర్ ఉస్మాన్ అలీఖాన్ బస్సుల నంబర్ ప్లేట్లలో తన తల్లిపేరు జెడ్ అక్షరం వచ్చేలా రిజిస్ట్రేషన్ చేయించారు. రూ.3.71 లక్షల నిధులతో ప్రారంభమైన సంస్థ నేడు కోట్లలో ఆదాయం ఆర్జిస్తోంది.

ఎర్రబస్సు నుంచి..

1932లో 27 ఎర్రబస్సులతో ప్రారంభమైన ఆర్టీసీ ప్రస్థానం దినదినాభివృద్ధి చెందుతోంది. ఆధునిక విజ్ఞానం వేగంగా పెరగడంతో బస్సు పరిమాణం, కెపాసిటీ, వేగం సైతం పెరిగాయి. ఆర్టీసీ బస్సులకు గతంలో సెల్ఫ్‌స్టార్ట్ విధానం లేకపోవడంతో క్రాంకింగ్ విధానం ద్వారా తిప్పి బస్సును ప్రారంభించేవారు. అప్పట్లో బస్సు గంటకు 10 కిలోమీటర్ల వేగంతో నడిచేది. 100 కిలోమీటర్ల దూరం వెళ్లడానికి సుమారు 10 గంటల సమయం పట్టేది. ఈ బస్సులు పెట్రోల్‌తో నడిచేవి. రెండో ప్రపంచ యుద్ధకాలంలో చమురు కొరత సమస్య ఏర్పడడంతో కొన్ని రోజులపాటు బొగ్గు వినియోగించి ఆవిరి ద్వారా బస్సులు నడిపారు. ఆతర్వాత డీజిల్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఎలక్ట్రిక్ బస్సులను సైతం సంస్థ ప్రవేశపెడుతోంది. మొదటితరం బస్సుల్లో డ్రైవర్, కండక్టర్‌తో పాటు 17 మంది మాత్రమే ప్రయాణించే వెసులుబాటు ఉండేది. నేటి బస్సులు గంటకు వందల కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తుండగా సీట్ల కెపాసిటీ సైతం పెరిగింది. బస్సులను ఆధునీకరించడంతో విలాసవంతంగా ఎయిర్ కండిషన్డ్ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణం చేయగలుగుతున్నారు.

టిక్కెట్ టు డిజిటల్ పేమెంట్స్...

బస్సులో ప్రయాణించాలంటే టిక్కెట్ ఉండాల్సిందే. గతంలో కండక్టర్లు ప్రత్యేక ప్రత్యేకంగా ముద్రించిన టిక్కెట్లపై పంచింగ్ వేసి ఇచ్చేవారు. స్టేజీని బట్టి ప్రయాణికుల నుంచి డబ్బులు తీసుకొని పంచింగ్ చేసి టిక్కెట్లు ఇచ్చేవారు. ఎన్ని టిక్కెట్లు ఇచ్చారనే లెక్కలను ట్రిప్ షీట్‌లో నమోదు చేసేవారు. ఈ విషయంలో కండక్టర్లు మానసిక ఒత్తిడికి గురయ్యేవారు. పలు సందర్భాల్లో ఈ చిన్న విషయం ఆదాయంపై సైతం ప్రభావం చూపింది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రానిక్ టిక్కెట్ మెషిన్లు అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం టిమ్స్ (టికెట్ ఇష్యూయింగ్ మెషీన్)తో పాటు డిజిటల్ పేమెంట్లు సైతం ప్రారంభించారు.

ఉమ్మడి జిల్లా వివరాలు

	నాడు	నేడు
డిపోలు	01	06
బస్సులు	07	612

ఆదిలాబాద్ రీజియన్ ముఖచిత్రం

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 1975లో మంచిర్యాల డిపో, 1980లో ఆదిలాబాద్ డిపో, 1991లో భైంసా, 1996లో ఉట్నూర్ డిపోలను ఏర్పాటు చేశారు. 1994లో రీజియన్ ఏర్పాటైంది.

రాష్ట్రంలోనే తొలి డిపో..

1932లో రాష్ట్ర వ్యాప్తంగా 16 డిపోలను నిర్మించారు. అసఫ్‌జాహీ వంశం పేరు మీదుగా ఏర్పడిన ఆసిఫాబాద్ జిల్లాపై ఉన్న మమకారంతో జిల్లా కేంద్రంలో డిపో నిర్మించి 7 బస్సులను కేటాయించారు. ఆసిఫాబాద్ నుంచి మహారాష్ట్రలోని రాజురా, మంచిర్యాల, రెబ్బెన రూట్లలో బస్సులు నడిపించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే ఇది తొలి డిపో కావడం విశేషం. ఈ డిపో 92 వసంతాలు పూర్తి చేసుకుంది.

నిర్మల్‌కూ ప్రత్యేకత...

నిర్మల్ జిల్లా కేంద్రంలో 1934 నవంబర్ 5న ఆర్టీసీ డిపో ప్రారంభమైంది. కేవలం ఐదు బస్సులు కేటాయించగా 15 నుంచి 20 మంది సిబ్బంది విధులు నిర్వర్తించేవారు. నైజాం కాలంలో నడిపిన 19 సీటర్ అల్బియన్ బస్సు నిర్మల్ డిపో నుంచి నాందేడ్ రూట్‌లో నడిపేవారు.

కంది శ్రీనివాసరెడ్డికి టికెట్ ఇవ్వొద్దు



గాంధీభవన్ ఎదుట ధర్నాలో కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: ఆర్‌ఎస్‌ఎస్ నుంచి వచ్చిన కంది శ్రీనివాసరెడ్డికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. నియోజకవర్గం నుంచి ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్ తరలివెళ్లిన నాయకులు అక్కడ శ్రీనివాసరెడ్డికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వాళ్లకే టికెట్ కేటాయించాలని, కష్టపడిన వారిని గెలిపించుకుంటామన్నారు. పదిహేన్నేళ్లుగా అధికారం లేకపోయినా పార్టీ కోసం పనిచేస్తూ జెండా మోసిన వాళ్లకే టికెట్ కేటాయించాలన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నుంచి వచ్చిన కంది శ్రీనివాసరెడ్డికి టికెట్ కేటాయించవద్దని డిమాండ్ చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఎన్నో సేవలు అందించిన డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్, పార్టీ సీనియర్ నాయకురాలు గతంలో పోటీచేసిన గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డిల్లో ఎవరికిచ్చిన తాము కష్టపడి పనిచేస్తామన్నారు. నాయకులు జి. నగేష్, ఖలీమ్, తుకారాం పాల్గొన్నారు.

సీసీఐ పునః ప్రారంభానికి ప్రకటన చేయాలి

ఎదులాపురం: సభ నిమిత్తం ఈ నెల 10న జిల్లా కేంద్రానికి రానున్న కేంద్ర మంత్రి అమిత్ షా సభలో స్థానిక సీసీఐ పునః ప్రారంభంపై ప్రకటన చేయాలని సీసీఐ సాధన సమితి జిల్లా కన్వీనర్ దర్శనాల మల్లేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీసీఐ పునః ప్రారంభం అనేది జిల్లా ప్రజల చిరకాల వాంఛ అని గుర్తు చేశారు. అందుకోసం పార్టీలకు అతీతంగా సీసీఐ సాధన కమిటీ రెండేళ్లుగా పోరాడుతుందని గుర్తు చేశారు. కేంద్ర మంత్రి అమిత్‌షాను కలసి వినతిపత్రం ఇవ్వడానికి అవకాశం కల్పించాలని ఎంపీ సోయం బాపూరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్‌ను సమితి కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సమావేశంలో సమితి కన్వీనర్ దర్శనాల మల్లేష్, కో కన్వీనర్ విజ్జగిరి నారాయణ, నాయకులు కొండా రమేష్, అరవింద్, నందిరామయ్య, బండి దత్తాత్రి, ఈశ్వర్ దాస్, రాజన్న పాల్గొన్నారు.



వినియోగదారుల హక్కులపై అవగాహన

- వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు, జడ్జి శామ్యూల్



మాట్లాడుతున్న వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు, జడ్జి శామ్యూల్

ఎదులాపురం: ఉమ్మడి జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వినియోగదారుల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు, జడ్జి శామ్యూల్, జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఇందులో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ అనిత, వినియోగదారుల సహాయ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరలాల్ చౌరాసియా, ఉపాధ్యక్షుడు సంపత్ కుమార్, జిల్లా కన్జుమర్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షుడు ఆంజనేయులు, ఉమ్మడి జిల్లా వినియోగదారుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు మోహన్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ పాల్గొన్నారు.

గిరి రైతులు అభివృద్ధి చెందాలి

- ట్రెయినీ కలెక్టర్ వికాస్ మెహత



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ట్రెయినీ కలెక్టర్

తలమడుగు: గిరిజన రైతులు ఐటీడీఏ నుంచి అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ట్రెయినీ కలెక్టర్ వికాస్ మెహత అన్నారు. మండలంలోని పల్సి(బి), పల్సి (తండా), పల్సి(కె), కోసాయి, దేహగామ గ్రామాల్లో గిరిజన రైతుల పంట పొలాల్లో గిరివికాసంలో త్రీ ఫేస్ సౌకర్యం కల్పించడంతో శనివారం ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామానికి వచ్చిన ట్రెయినీ కలెక్టర్‌ను, జెడ్పీటీసీ గణేష్‌రెడ్డి, ఎంపీటీసీలను గ్రామస్తులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డీఈ ప్రభాకర్, ఏఈలు, శ్రీనివాస్, సతీష్, సర్పంచులు పాయల్ అంగూర్, సరోజా, గోపాల్, సుభాష్, ఎంపీటీసీలు హనుమంతు, వెంకన్న యాదవ్, రమేష్ రెడ్డి, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత



పట్టుకున్న గుడుంబాతో పోలీసులు

కుంటాల: మండలంలోని దౌనెల్లి పంచాయతీ పరిధిలోని తండాలో శనివారం సాయంత్రం గుడుంబా స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. గుడుంబా తయారు చేస్తున్న రాథోడ్ శ్యామ్‌రావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గుడుంబా పట్టివేత

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు తయారు చేస్తున్న గుడుంబా స్థావరంపై శనివారం దాడులు చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఈ సందర్భంగా రూ.9వేల విలువైన 30లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన మంచికంటి గంగన్నపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. పొన్కల్‌లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుడుంబా విక్రయించేందుకు వెళ్తున్న గంగన్నను పట్టుకుని కేసు నమోదు చేశారు. గుడుంబాను తయారు చేసినా, విక్రయించినా వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.


మెండపల్లిలో ఫుడ్ పాయిజన్

- 70మందికి అస్వస్థత...ఆస్పత్రికి తరలింపు
- గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు




అస్వస్థతకు గురైన వారిని పరీక్షిస్తున్న వైద్యుడు శ్రీకాంత్

ఇంద్రవెల్లి: మండలంలోని మెండపల్లి గ్రామంలో ఫుడ్ పాయిజన్‌తో 70మంది అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామస్తుల వివరాల ప్రకారం... ఈ నెల 5న గురువారం సాయంత్రం మెండపల్లి గ్రామానికి చెందిన ముండే బలిరామ్ ఇంట్లో పెద్దల పేర్లతో పితృపక్ష పూజలు నిర్వహించి అన్నం, పప్పుతో పాటు బూరెలతో భోజనం ఏర్పాటు చేశాడు. సాయంత్రం ఐదు గంటలలోగా భోజనం చేసిన వారికి ఎలాంటి సమస్య రాలేదు. సాయంత్రం భోజనం చేసిన వారిలో కొందరు శుక్రవారం సాయంత్రం వాంతులు, విరేచనలతో అస్వస్థతకు గురికాగా మండల కేంద్రంతో పాటు జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రులకు తరలించారు. శనివారం తెల్లవారుజాము నుంచి గ్రామంలో సుమారు 70మంది అస్వస్థతకు గురయ్యారు. ఇందులో కనరే రాదాబాయి(40), ముండే సుగందా(45), సింధుబాయి(50), బలిరామ్(50), అంజలి(50), యేమునబాయి(45), మానే సునిత(35), ఉర్మిళ(45), ముండే జ్యోతి(17) తీవ్రంగా అస్వస్థతకు గురికాగా 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కాడే డిగంబార్(60), కాడే సాక్షి(14), కాడే అనిత(36), కాడే కార్తీక్(26), కాడే నానేశ్వర్(30), శిరశాట్ ఉర్మిళ(60), ముండే ఐశ్వర్యం(18), రాములు(50) అంబులెన్స్‌ల ద్వారా మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే పలువురు మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు మెండపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అయితే ముండే బలిరామ్ ఇంటి బోరు బావి నీరు తాగి అస్వస్థతకు గురైన పలువురి మూత్రం శాంపిల్ సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు వైద్యుడు శ్రీకాంత్ తెలిపారు. అదనపు వైద్యాధికారి విజయ్‌కుమార్ గ్రామాన్ని సందర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.



అంబులెన్స్‌లో బాధితులను ఆస్పత్రికి తరలింపు



మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబీకులు

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి



ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న బొజ్జుపటేల్

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలంలోని మెండపల్లిలో అస్వస్థతకు గురైన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జుపటేల్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. విషయం తెలుసుకుని వారు శనివారం వేర్వేరుగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి బాధితుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం మెండపల్లి గ్రామానికి సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. ఇందులో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల దాడిలో 10మందికి గాయాలు



కుక్కకాటుకు గురైన దీలిప్

బేల: మండల కేంద్రంలోని మార్కెట్ కూడలిలో శనివారం సాయంత్రం రెండు పిచ్చి కుక్కలు విజృంభించాయి. మార్కెట్ కూడలితో పాటు కుమురంభీం చౌరస్తాలో జాతీయ రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు, ఆయా పనుల కోసం వచ్చిన 10మందిపై దాడి చేసి గాయపరిచాయి. దీంతో బాధితులు వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకాలు తీసుకున్నారు. తీవ్ర గాయాలపాలైన వారిలో బేలకు చెందిన దిలీప్, దహెగాంకు చెందిన ఇర్ఫాన్‌తో పాటు మరో ఎనిమిది మంది ఉన్నారు.

కేసుల విచారణలో న్యాయవాదుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్

నిర్మల్‌టౌన్: క్రిమినల్ కేసుల విచారణలో న్యాయవాదుల పాత్ర కీలకమని తెలంగాణ హైకోర్టు జడ్జిలు జస్టిస్ కె.లక్ష్మణ్, సూరేపల్లి నంద అన్నారు. ఏబీఏపీ 31వ ఫౌర్మేషన్ డే సందర్భంగా న్యాయవాది పరిషత్ నిర్మల్ యూనిట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోశనివారం క్రిమినల్ ట్రయల్ లాయర్ పర్స్పెక్టివ్‌పై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రిమినల్ కేసులను ట్రయల్స్‌లో ఎలా విచారించాలో పలు ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ న్యాయవాది పరిషత్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ సునీల్, నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ నరేందర్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు..

పట్టణ శివారులోని శ్రీ గండిరామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో శనివారం హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టు చైర్మన్ లక్కడి జగన్మోహన్ రెడ్డి స్వాగతం పలికారు. పూజారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.